

కాలినడకన వెళ్తున్న వైద్య సిబ్బంది

## కాలినడకన వెళ్లి.. వైద్య సేవలందించి

నార్నూర్,ఆగస్టు 26 : నార్నూర్ మండలం భీంపూర్, కొత్తపల్లి(హెచ్) గ్రామ సమీపంలోని బొజ్జుగూడ, గోండుగూడ, తండాకు నార్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది సోమవారం రెండు కిలో మీటర్లు కాలి నడకన వెళ్లి వైద్య సేవలు అందించారు. ఇంటింటా జ్వర సర్వే చేశారు. బాధితులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సంపూర్ణ శుభ్రత పాటించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకుడు చౌహాన్ చరణ్‌దాస్, వైద్య సిబ్బంది జవహర్‌లాల్, శ్యాంకా, లక్ష్మి, రుక్మాబాయి, నీలాబాయి పాల్గొన్నారు.

## గుట్టపైకి మూడు కిలో మీటర్లు నడిచి..



చిన్నమియతండాలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

బజార్‌హత్నూర్, ఆగస్టు 26: మండలంలోని చిన్నమియాతండా గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదు. దీంతో బజార్‌హత్నూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి భీంరావ్, వైద్యసిబ్బంది సోమవారం మూడు కిలో మీటర్లు గుట్టపైనున్న గ్రామానికి నడిచి వెళ్లి సేవలు అందించారు. ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో సూర్య ప్రకాశ్, హెల్త్‌అసిస్టెంట్ గాజుల రమేశ్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



నిర్మల్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సిబ్బంది

## వేతనాలు వెంటనే చెల్లించాలి

### మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికుల ఆందోళన

నిర్మల్ అర్బన్, ఆగస్టు 26 : మున్సిపల్ కార్మికులకు వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నిర్మల్ మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. మున్సిపల్ కార్మికులకు నాలుగు నెలల వేతనాలు, పీఎఫ్ డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిచో మంగళవారం నుంచి విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు.



బొడ్డొనికుంట వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న కాలనీల ప్రజలు

## రోడ్డుపై బైఠాయించి నిరసన

ఖానాపూర్, ఆగస్టు 26 : నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోని శాంతినగర్, తిమ్మాపూర్, సుభాష్ నగర్, మదీనకాలనీలో దోమలు, ఈగలు, మురుగు నీటి వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం 'బొడ్డొని కుంట' వద్ద ఆందోళన చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. నాయకులు, అధికారులు తమ గోసను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సీజనల్ వ్యాధులతో చాలా మంది చికెన్‌గున్యా, డెంగ్యూ, విష జ్వరాల బారిన పడి మృతి చెందిన ఘటనలు ఉన్నాయని పేర్కొన్నారు. కుంట నుంచి వచ్చే దుర్వాసన, ఈగలు, దోమలతో అనారోగ్యానికి గురవుతూ దవాఖానల్లో లక్షల రూపాయలు వెచ్చించాల్సి వస్తుందన్నారు. ఇకనైనా అధికారులు స్పందించాలని కోరారు.



హెల్మెట్ పంపిణీ చేస్తున్న నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల

## సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

- నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల
- పెంబి, మందపల్లిలో సీసీ కెమెరాలు ప్రారంభం

పెంబి, ఆగస్టు 26 : సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించవచ్చని నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల అన్నారు. సోమవారం పెంబి, మందపల్లి గ్రామాల్లో పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను డీఎస్పీ గంగారెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం వేణునగర్‌లో కోలాం గిరిజనులకు మత్తు పదార్థాల నియంత్రణ, రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. పెంబి, వేణునగర్, మందపల్లి గ్రామాల్లో యువకులు వాలీబాల్ కిట్లు, హెల్మెట్లు, మహిళలకు చీరలు, కూరగాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో దొంగతనాలు, దోపిడీలు, పలు నేరాలు నియంత్రించవచ్చన్నారు. గ్రామస్తుల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన ఎస్‌ఐ శంకర్‌ను అభినందించారు. ప్రతి ఒక్కరూ ఉన్నతం చదువులు చదువుకోవాలని, యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ గంగారెడ్డి, సీఐ సైదరావు, ఎస్‌ఐ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



తల్లిని కోల్పోయిన కవల పిల్లల కోసం పాలడబ్బాలు అందిస్తున్న శిశు సంక్షేమ శాఖ అధికారులు

## తల్లిని కోల్పోయిన కవల పిల్లలను ఆదుకుంటాం

ఇంద్రవెల్లి, ఆగస్టు 26 : తల్లిని కోల్పోయిన కవల పిల్లలను అన్ని విధాలా ఆదుకుంటామని శిశు సంక్షేమ శాఖ అధికారులు ప్రేమ్, అనిల్‌కుమార్, వైష్ణవి పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం అందునాయక్‌తండా గ్రామానికి చెందిన వాగ్మారే గోవింద్ భార్య దీక్ష ఇద్దరు కవల పిల్లలకు జన్మనిచ్చి మృతి చెందగా.. విషయం తెలుసుకున్న శిశు సంక్షేమ శాఖ అధికారులు సోమవారం అందునాయక్‌తండాను సందర్శించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శిశు సంక్షేమ శాఖ అధికారులు ప్రేమ్, అనిల్‌కుమార్, వైష్ణవి మాట్లాడుతూ కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు తల్లిని కోల్పోయిన కవల పిల్లలతో పాటు కుటుంబ సభ్యులకు బట్టలు, పాల డబ్బాలు, నిత్యావసర సరుకులు అందజేశామన్నారు. వాగ్మారే దీక్ష కర్మకాండల తర్వాత కవల పిల్లలను శిశు సంక్షేమ శాఖకు చెందిన శిశు గృహానికి అందించాలా లేదా అనేది ఆలోచించి చెప్పడం జరుగుతుందని కవల పిల్లల తండ్రి గోవింద్‌కు తెలిపామన్నారు. కవల పిల్లలను శిశు గృహానికి అందిస్తే వారిని అన్ని విధాల సంరక్షణ చేయడం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త మనికతాయి, తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్ దవాఖానలో చికిత్స పొందుతున్న రోగులు




ఉట్నూర్ ప్రభుత్వ దవాఖానలో ఓపీ కోసం బారులుతీరిన జనం

# ఏజెన్సీకి జ్వరం

## విజృంభిస్తున్న వైరల్ ఫీవర్స్

- పీహెచ్‌సీలకు పెరుగుతున్న రోగుల సంఖ్య
- జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు రెఫర్
- ఉట్నూర్ దవాఖానలో ప్రతి రోజూ 500 ఓపీ

ఆదిలాబాద్ (నమస్తే తెలంగాణ)/ఉట్నూర్, ఆగస్టు 26 : ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతానికి జ్వరమొచ్చింది. సీజనల్ వ్యాధులతో ఉట్నూర్, నార్నూర్, గాదిగూడ, ఇంద్రవెల్లి, సిరికొండ మండలాల్లోని గిరిజనం మంచం పట్టింది. జ్వరం, తలనొప్పి, కాళ్లు, చేతుల లాగడం, జలుబు, దగ్గు, చలిలాంటి సమస్యలతో సతమతమవుతున్నారు. ఏజెన్సీ పల్లెల్లో అపరిశుభ్రమైన వాతావరణం, కలుషితమైన నీరులాంటివి వ్యాధులకు కారణమవుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్‌తో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రోగుల సంఖ్య పెరుగుతున్నది. పేషెంట్ల పరిస్థితిని బట్టి మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు రెఫర్ చేస్తున్నారు. వైరల్ ఫీవర్స్ కారణంగా వైద్యం కోసం నాలుగు రోజులకు పైగా దవాఖానల్లో ఉండాల్సి వస్తుంది. వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తుండగా, మారుమూల గ్రామాల ప్రజలు వైద్యం కోసం రావడానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. వైద్య సిబ్బంది జ్వర ప్రభావిత ప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నది.

### ఉట్నూర్ దవాఖానలో 500 ఓపీ

ఏజెన్సీ ప్రాంతాల్లో పలు రకాల వ్యాధులు ప్రబలుతుండడంతో ఉట్నూర్ ప్రభుత్వ దవాఖానకు వచ్చే రోగుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతున్నది. ఇక్కడ కొన్ని రోజులుగా 400 నుంచి 500 వరకు ఓపీ నమోదవుతున్నది. సుమారు 100 మంది ఇన్ పేషెంట్లకు చికిత్స అందిస్తున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. ఇక్కడ సరిపడా వైద్య సిబ్బంది లేక ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. 21 మంది వైద్యులకుగాను కేవలం ఏడుగురితోనే వెళ్లదీస్తున్నారు. 44 మంది స్టాఫ్ నర్సులు అవసరముండగా, కేవలం 29 మంది సిబ్బందితోనే కొనసాగిస్తున్నారు.



బోథ్ : ఉట్టి కొడుతున్న చిన్నారులు



ఆదిలాబాద్‌లోని ఇస్కాన్ ఆలయంలో క్యూ కట్టిన భక్తులు



కుంటాల : ఉట్టి కొడుతున్న చిన్నారి

## ఆ'నంద' హేల

- ఊరూరా కనుల పండువలా కృష్ణాష్టమి
- మందిరాల్లో భక్తుల పూజలు
- శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించిన చిన్నారులు
- పలుచోట్ల ఉట్ల సంబురాలు

ఊరూరా శ్రీకృష్ణాష్టమి వేడుకలను సోమవారం ఆ'నంద'ంగా జరుపుకున్నారు. కృష్ణుడి జన్మదినాన్ని పురస్కరించుకొని భక్తులు మందిరాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన చౌరస్తాల్లో 'ఉట్ల పండుగ'ను ఘనంగా నిర్వహించగా, యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారులు నృత్యాలతో అలరించారు. కృష్ణుడు, రాధిక, గోపిక వేషధారణలో ఆకట్టుకున్నారు. ఇక యువతులు శ్రీకృష్ణ భగవానుని గీతాలు ఆలపిస్తూ సందడి చేశారు. - నమస్తే బృందం

# వైద్యులకు పటిష్టమైన భద్రత

- ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి
- రిమ్స్ దవాఖాన సందర్శన



సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న డీఎస్పీ, రిమ్స్ డైరెక్టర్, సీఐలు

ఎదులాపురం,ఆగస్టు 26 : కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన ఘటనతో ఆదిలాబాద్ జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం ఆదేశాల మేరకు డీఎస్పీ జీవన్ రెడ్డి సోమవారం రిమ్స్‌ను సందర్శించారు. భద్రత చర్యలు, వార్డులు, మెడికల్ రెసిడెన్షియల్ క్వార్టర్లు, సీసీ కెమెరాల పని తీరును రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్‌తో కలిసి పరిశీలించారు. రిమ్స్‌తో పాటు సూపర్ స్పెషాలిటీ దవాఖానలో రెండు గంటల పాటు పర్యటించి పలు విషయాలను గుర్తించారు. అనంతరం సూపర్ స్పెషాలిటీ దవాఖానలో డైరెక్టర్ రాథోడ్ జైసింగ్, ఆర్ఎం చంపత్‌రావు, సీఐలు, వైద్యులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ కోల్‌కతా ఘటన నేపథ్యంలో రిమ్స్‌లో భద్రత చర్యలను పరిశీలించామన్నారు. ఇక్కడి సెక్యూరిటీ ఏ విధంగా వ్యవహరించాలో సూచించామన్నారు. ఔట్ పోస్టులో నిరంతరం పోలీసు సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆరుగురు విధులు నిర్వహిస్తున్నారని, మరో ఇద్దరిని నియమించామని తెలిపారు. అలాగే ఇక్కడి పోలీసులకు వాకీటాకీ ఇస్తామన్నారు. రిమ్స్‌లో, సమీపంలో ఏ చిన్న గొడవ జరిగిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. పాత నేరస్తులు ఎవరైనా వస్తే వారిపై నిఘా పెట్టాలని ఆదేశించామన్నారు. రిమ్స్‌లో గుర్తించిన, చేపట్టిన పనులు ఎస్పీకి వివరిస్తామని తెలిపారు. అనంతరం డైరెక్టర్ జైసింగ్ మాట్లాడుతూ రిమ్స్‌లో అన్ని విధాలుగా తమ సెక్యూరిటీతో భద్రత చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదే విధంగా 150 సీసీ కెమెరాలు ఉన్నాయని వాటిలో 10, 12 పని చేయడం లేదని దీనికి సంబంధించిన వాటికి మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. తమ సెక్యూరిటీతో పాటు పోలీసులతో రిమ్స్ మరింత బందోబస్తు ఉంటుందన్నారు. వైద్యుడు సత్యనారాయణ, సీఐలు కరుణాకర్‌రావు, సునీల్‌కుమార్, మావల ఎస్‌ఐ విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

## అనుమతుల్లేని ప్రైవేట్ దవాఖానలకు నోటీసులు

### ఏజెన్సీ అదనపు వైద్యాధికారి కుడిమేత మనోహర్



హోలీ ట్రినిటీ దవాఖానలో రోగులతో మాట్లాడుతున్న కుడిమేత మనోహర్

ఇంద్రవెల్లి, ఆగస్టు 26 : అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ దవాఖానాలకు నోటీసులు జారీ చేస్తామని ఏజెన్సీ అదనపు వైద్యాధికారి కుడిమేత మనోహర్ హెచ్చరించారు. సోమవారం ఇంద్రవెల్లిలోని హోలీట్రినిటీ దవాఖానను ఏజెన్సీ అదనపు వైద్యాధికారి మనోహర్ తనిఖీ చేశారు. దవాఖానలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. వైద్యంతో పాటు సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు వైద్యం అందించే వార్డులు, ప్రత్యేక గదులతో పాటు రక్త పరీక్ష గది, మందుల స్టోర్ రూం, తాగునీటి సౌకర్యాలు, మరుగుదొడ్లు, విద్యుత్, అత్యావసర పరిస్థితిలో వైద్యం అందించే వార్డులను పరిశీలించారు. దవాఖానలో వైద్యం అందిస్తున్న ఏఎన్ఎంలతో పాటు ల్యాబ్ టెక్నీషియన్లను వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులతో పాటు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి దవాఖానలు నిర్వహించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. తమ తనిఖీలో గుర్తించిన దవాఖానాలకు తప్పకుండా నోటీసులు జారీ చేస్తామన్నారు. హోలీట్రినిటీ దవాఖానకు 2017 వరకు అనుమతి ఉందని, ఏడేళ్ల నుంచి అనుమతులు లేకుండానే నడిపిస్తున్నారని తెలిపారు. వీరికి నోటీసులు జారీ చేసి నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు. వైద్య పరీక్షలతో పాటు వైద్యానికి సంబంధించిన అన్ని రకాల ధరలతో కూడిన పట్టికను ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట హెచ్‌ఈవోలు నాందేవ్, పవార్ రవీందర్, హెల్త్ సూపర్‌వైజర్ జాదవ్ శ్రీనివాస్ ఉన్నారు.

### ముగ్గురికి మెమోలు

విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తున్న ముగ్గురికి ఏజెన్సీ అదనపు వైద్యాధికారి కుడిమేత మనోహర్ మెమోలు జారీ చేశారు. ఇంద్రవెల్లిలోని పీహెచ్‌సీని తనిఖీ చేశారు. విధులకు రాకుండానే రిజిస్టర్‌లో హాజరు వేసుకున్న హెల్త్ అసిస్టెంట్ వినోద్‌తో పాటు కంటి వైద్య పరీక్ష అసిస్టెంట్ విజయ్‌కుమార్, అటెండర్ స్వామిలకు గైర్హాజరు వేసి మెమోలు జారీ చేశారు. ఆయన వెంట పీహెచ్‌సీ డాక్టర్ శ్రీకాంత్, హెల్త్ సూపర్‌వైజర్ జాదవ్ శ్రీనివాస్, హెచ్‌ఈవోలు నాందేవ్, పవార్ రవీందర్, తదితరులు ఉన్నారు.

## డిపోకు సెమీ డీలక్స్ బస్సు

ఎదులాపురం, ఆగస్టు 26 : ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోకు సెమీ డీలక్స్ బస్సు వచ్చినట్లు డిపో మేనేజర్ కల్పన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ ఈ బస్సు ఆదిలాబాద్ నుంచి ఉట్నూర్‌కు ఉదయం 8.45గంటలకు బయలుదేరుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా ఉట్నూర్ నుంచి ఆదిలాబాద్‌కు ఉదయం 10.15 గంటలకు బయలుదేరుతుందని తెలిపారు. అలాగే ఆదిలాబాద్ నుంచి మంచిర్యాలకు మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరుతుందన్నారు. మంచిర్యాల నుంచి ఆదిలాబాద్‌కు సాయంత్రం 4.15 గంటలకు బయలుదేరుతుందని పేర్కొన్నారు.



తనిఖీ చేస్తున్న వైద్య బృందం సభ్యులు

## ప్రైవేట్ దవాఖానల్లో తనిఖీ

ఎదులాపురం, ఆగస్టు 26 : కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్య శాఖ బృందం సభ్యులు ఆదిలాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానల్లో తనిఖీలు కొనసాగిస్తున్నారు. సోమవారం పట్టణంలోని నేతాజీచౌక్‌లోని నర్సింగ్ హోంను తనిఖీ చేశారు. దవాఖానకు సంబంధించిన పలు పత్రాలు పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకే నిర్వహణ కొనసాగించాలని వైద్యులకు సూచించారు. తనిఖీల్లో వైద్య బృందం సభ్యులు, డాక్టర్లు రాథోడ్ నరేంద్ర, శ్రీధర్ పాల్గొన్నారు.

## ఆన్‌లైన్‌లో మట్కా నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్టు

నిర్మల్ చైన్‌గేట్, ఆగస్టు 26 : నిర్మల్‌లో ఆన్‌లైన్‌లో మట్కా నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వనాథ్‌పేటలో కొందరు వ్యక్తులు మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో తనిఖీ చేపట్టారు. షేక్ అఫ్రోజ్ అనుమానాస్పదంగా కనిపించగా అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా తన నేరాన్ని ఒప్పుకున్నాడు. అతడి నుంచి రూ.27 వేలు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు.